క్లుప్తంగా

చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజ



తెనాలి: పవిత్ర కార్తికమాసంలో మాసశివ రాత్రి సందర్భంగా స్థానిక మారీసుపేటలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం విశేషపూజా మహోత్సవం నిర్వహించారు. ఉదయం శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. తర్వాత అమ్మవారికి ప్రీతిగా ముత్తయిదువలచే సామూహిక కుంకుమార్చన జరిపారు. మధ్యాహ్నం స్వామికి లక్ష బిల్వార్చన, సాయంత్రం మహా జ్యోతిర్లింగార్చన, హారతి, మంత్రపుష్పం, శివపార్వతుల శాంతి కల్యాణం చేశారు. అనంతరం కార్తిక సమారాధన చేశారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, సభ్యులు పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

కలెవరంలో మాసశివరాత్రి వేడుకలు



తెనాలి: రూరల్ మండల గ్రామం కలెవరంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి వేడుకలు వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సుబ్బరాజు, సభ్యులు వెంకటరమణ, వెంకమరాజు, ఆలయ అర్చకుడు ప్రతాప్‌రుద్ర శర్మ ఆధ్వర్యంలో 'మహన్యాస పూర్వక రుద్రాభిషేకం', 'లక్ష బిల్వార్చన' భక్తిపూర్వకంగా నిర్వహించారు. కార్యక్రమంలో లక్కరాజు మురళి, వెంకట ఉమాకాంత్, శ్రీనివాస్‌తో సహా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.

ఒకటిన ఆలూరి బైరాగి సభ

తెనాలి: మానవ జీవితంలో ఆధునికత వైపరీత్యాలను తాత్వికంగా వ్యతిరేకించిన తొలి తెలుగు కవి, తెనాలికి చెందిన ఆలూరి బైరాగి శతజయంతి సభను డిసెంబరు ఒకటో తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. అరసం ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం 10 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారు. హిందీ అకాడమీ విశ్రాంత ఛైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, ప్రముఖ కవి బండ్ల మాధవరావు పాల్గొంటారని అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. బైరాగి నాటికాలంలో అసంక్షుభిత గరళాన్ని తాను మింగి కవితామృతాన్ని మనకు పంచాడనీ, అభివృద్ధి నెపంతో ఆధునికత సృష్టించే వినాశనాన్ని ముందే హెచ్చరించిన కాలజ్ఞుడని పేర్కొంటూ ఆ మహాకవిని స్మరించుకునేందుకు సాహితీప్రియులు హాజరుకావాలని కోరారు.

పిల్లల భద్రత పెద్దల బాధ్యత



నెక్కల్లు(తాడికొండ): పిల్లల భద్రత పెద్దల బాధ్యత అని, అమూల్యమైన బాల్యం అవగాహనతో ముందుకు తీసుకెళితే భవితకు బంగారు బాటలు వేయవచ్చని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పిల్లల భద్రత పెద్దల బాధ్యత అనే అంశంపై నిర్వహించిన అవవగాహన సదస్సుకు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలిలో పిల్లలు ఎక్కువగా టీవీ, సెల్ ఫోన్‌లలో బిజీ బిజీగా గడపుతున్నారన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందిపై ఉందన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 100 లకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. గుడ్ షెపర్డ్ కాన్వెంట్ తుళ్లూరు మండల కమ్యూనిటీ అర్గనైజర్ అత్తోట పోతురాజు, కార్యదర్శి ఎం.సాయి నాగేంద్ర, మహిళా కానిస్టేబుల్ కె.శ్రావణి, సిబ్బంది ఎస్ నాగమణి, బి.విజయలక్ష్మీ, జె.ఇశ్రాయేల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: నులక పేట మాతా శివ చైతన్య ఆశ్రమంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శిబిరాన్ని చైతన్య తపోవన్ అధిపతి మాత శ్రీ శివ చైతన్య ప్రారంభించారు. హాస్పిటల్ ఫౌండర్, గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ మాట్లాడుతూ ఎకో, ఈసీజీ, మెదడు, నరాలు, ఆర్థో, కిడ్నీ, కంటి, గైనిక్ పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలిపారు.

ఆర్‌ఎస్‌కేల్లో పనిచేయని కియోస్క్‌లు

సాఫ్ట్‌వేర్ సమస్యతో మూలన పడేసిన వైనం

తెనాలిరూరల్: రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే డిజిటల్ కియోస్క్‌లు నిరుపయోగంగా పడి ఉన్నాయి.ఎప్పటికప్పుడు రైతులకు కావల్సిన సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించిన ఈ యంత్రాలు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో మూలన పడ్డాయి. నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాల గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

తెనాలి పట్టణం, మండలంలో 19, కొల్లిపర మండలంలో 15 ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు లక్షలాది రూపాయలను ఖర్చు చేసి కియోస్క్ యంత్రాలను గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, సమీపంలోని మార్కెట్ వివరాలు తదితర అవసరమైన వివరాలన్నింటినీ ఈ డిజిటల్ కియోస్క్‌ల ద్వారా తెలుసుకునే వీలుంది. ఖచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయశాఖ అన్ని విధాలా సేవలందించి వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్నా.. సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన ఈ కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మూలన పడ్డాయి.

కూటమి వచ్చిన తరువాతే...

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు భరోసా కేంద్రాల పేర్లను రైతు సేవా కేంద్రాలుగా పాలకులు మార్చారే మినహా, అక్కడ లభిస్తున్న సేవలను మెరుగుపరచే విధంగా చర్యలు తీసుకోలేకపోయారు. దీంతో కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. సాంకేతిక పరమైన సాఫ్ట్‌వేర్ సమస్యతో ఈ యంత్రాలు పని చేయడం లేదు. కొన్ని చోట్ల వీటిని పూర్తిగా విస్మరించడంతో విలువైన యంత్రాలు మూలన పడ్డాయి. కేవలం సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేసి, తాజా వివరాలను పొందుపరిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. చదువు రాని రైతు సైతం ఈ కేంద్రాలకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని సంప్రదిస్తే వారు ఈ యంత్రాల సాయంతో రైతుకు కావల్సిన ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తారు. అలాంటి ఈ యంత్రాల వ్యవహారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. ప్రస్తుత తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరా మంత్రి నాదెండ్ల మనోహర్ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకరుగా ఉన్న సమయంలో డిజిటలైజేషన్‌కు పెద్దపీట వేస్తూ తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయించారు. అలాంటిది ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు అధునాతన ఖచ్చిత సేవలందించే ఈ కియోస్క్‌ల విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తారేమో వేచి చూడాల్సిందే.



తూములూరు రైతు సేవా కేంద్రంలో పని చేయని కియోస్క్

> గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం మొక్కుబడిగా ఈ సేవలు అందుతున్నాయి. రైతులు అధిక ధరలకు ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. కియోస్క్‌ల విషయమై వ్యవసాయ శాఖ తెనాలి ఏడీఏ ఎస్. ఉషారాణిని వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా కొన్ని నెలలుగా ఈ యంత్రాలు పని చేయడం లేదని చెప్పారు. గతంలో ఈ యంత్రాలను ఏర్పాటు చేసిన నాటి సాంకేతిక నిపుణులు లేదా ప్రస్తుత ప్రభుత్వం నియమించే ఏజెన్సీ నుంచి సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తే వినియోగంలోకి వస్తాయని అభిప్రాయపడ్డారు.

అర్బన్ మార్కెట్ సేవలను ఉపయోగించుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌ను ప్రజలందరూ ప్రోత్సహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ మార్కెట్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న రుణాల ద్వారా వివిధ రకాల వ్యాపారులు చేస్తున్నట్లు తెలిపారు. వారి ఉత్పత్తులకు మార్కెట్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో నెలలో రెండు రోజులు అర్బన్ మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్పత్తులను అవసరమైన వారు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని సూచించారు. మెప్మా సీఎంఎం విజయకుమారి మాట్లాడుతూ శనివారం కూడా మెప్మా బజార్ జరుగుతుందని, అందరూ దీనిని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, మేనేజర్ దేవసేన, ఆర్వో రాంప్రసాద్ పాల్గొన్నారు.



వస్తువులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

చెత్తసేకరణ నూరుశాతం జరగాలి

తెనాలిఅర్బన్: చెత్త సేకరణ నూరుశాతం జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 2వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. డోర్ టు డోర్ కలెక్షన్‌ను ప్రతి రోజు జరగాలన్నారు. అలాగే రోడ్లపై ఎవరు చెత్తను వేయవద్దని సూచించారు. అనంతరం శివాజీచౌక్‌లోని పాత రత్నాటాకీస్ వైపు విస్తరించనున్న రోడ్డును ఆయన పరిశీలించారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

తెనాలిరూరల్: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వైద్య విద్యార్థుల వైద్య పరీక్షల కోసం వైద్య కళాశాలకు కుటుంబసభ్యులు అప్పగించారు. తెనాలి జేఎంజే కళాశాల ఎదురు అపార్ట్‌మెంట్‌లో నివసించే పువ్వాడ రవిబాబ(59) అనారోగ్య సమస్యలతో ఇంటి వద్దే శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వాలని కుటుంబసభ్యులు భావించారు. కళ్లను పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మృతదేహాన్ని విజయవాడ నిమ్రా వైద్య కళాశాలకు అప్పగించారు. అమ్మ నేత్ర, శరీరవ అవయవ దాన సంఘం ఆధ్వర్యంలో చట్ట ప్రకారం మృతదేహాన్ని దానం చేసినట్టు కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు తెలిపారు. రవి బాబు కుటుంబసభ్యులు పువ్వాడ శేషగిరిరావు, కె. నాగేంద్రప్రసాద్, జి. ప్రభంజన్, పి. శ్రీలక్ష్మి, నాగేంద్రమ్మ కళ్లు, శరీర దానానికి అంగీకరించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 8వ వార్డు మహాలక్ష్మి అమ్మవారి గుడి నుంచి మేడిశెట్టి వారి వీధి వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అనేక రోడ్లను విస్తరించడం జరుగుతుందన్నారు. రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 8వ వార్డులో నిర్మిస్తున్న రోడ్డు కోసం రూ.12.35 లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులు పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ఎంపీడీవో వి.విజయలక్ష్మి

బొమ్మువానిపాలెం(కొల్లిపర): ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని హనుమాన్‌పాలెం, బొమ్మువానిపాలెం, తూములూరు ఆయా గ్రామాలల్లోని గ్రామ సచివాలయంను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు హాజరు రికార్డులను పరిశీలించారు.సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.అంగ్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఏవిధంగా బోధిస్తున్నారు, ప్రభుత్వం అందిస్తున్న సేవలు వారికి సక్రమంగా అందుతున్నాయా, బాలింతలకు, గర్భిణులకు సరైన షౌష్టిహారం అందిస్తున్నారా అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. అంగ్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందించే షౌష్టికాహారంలో ఎటువంటి అవతవకలు జరిగినా, ఎటువంటి ఫిర్యాదులొచ్చినా ఆ కేంద్రాలలో ఉన్న సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



బొమ్మువానిపాలెం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో వి.విజయలక్ష్మి

అకాల వర్షంతో అన్నదాతకు ఇక్కట్లు



తూములూరులో ధాన్యం కుప్పలపై పట్టాలు కప్పుతున్న రైతులు



కొల్లిపర మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

కొల్లిపర: అకాల వర్షంతో రైతులు ఉరుకులు పరుగులు తీశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షం నుంచి కాపాడుకోవడానికి నానాపాట్లు పడ్డారు. మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతం తో ఒకసారిగా చిరుజల్లులతో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని ధాన్యం తడిసిపోకుండా ఆరబెట్టిన ధాన్యం పై రైతులు ఉరుకులు పరుగుల మీద పొలాలపై, రోడ్డు వెంట, గృహాల మధ్య ఉన్న ధాన్యం రాశులపై బరకాలను కప్పి రక్షించుకున్నారు. వ్యవసాయ పనులు మమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో వర్షాలు పడడంతో రైతులు నష్టపోతున్నారు. మరో మూడు వారాల పాటు వాతావరణం అనుకూలిస్తే ఆరుగాలం శ్రమించిన పంట పూర్తి స్థాయిలో చేతికందుతుందని రైతులు చెబుతున్నారు.కాని వాతావరణం అనుకూలించక పోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. కొల్లిపర మండలంలో 20 గ్రామాలల్లో 12,482 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ఇప్పటికి తూములూరు గ్రామంలో మాత్రమే 90 శాతం వరి కోతలు పూర్తి అయినవి. మిగిలిన వల్లభాపురం, మున్నంగి, అత్తోట, చివలూరు, కొల్లిపర, పిడపర్రు, దావులూరు గ్రామంలో 25శాతం మాత్రమే కోతలు నిర్వహించారు. పంటలు చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలు పడటం వలన వరి పంట పూర్తి గా నేల వరిగి ధాన్యం నేలపాలవుతుంది. మొక్కలు వస్తాయి. ధాన్యం రాశులు తడవటం వల్ల ధాన్యం మొక్కలు రావటం, బూజు పట్టం, రంగు మారటం జరుగుతుందని, కావున వర్షం పడకుండా కేవలం చిరుజల్లులతో వర్షాలు పడి అంతటితో వర్షం తగ్గితే దేవుడు ఎంతో మేలు చేసినట్లు అని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ మహిళా బాడీబిల్డర్ ఎస్తేరురాణికి అభినందన

తెనాలి: ఆంధ్రప్రదేశ్ నుండి తొలి మహిళా బాడీబిల్డర్ రావూరి ఎస్తేరురాణిని తెనాలికి చెందిన అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో అభినందన సత్కారం చేశారు. హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ కటికల వెంకటరావు చేతుల మీదుగా ఈ సన్మానం జరిగింది. ఎస్తేరురాణి సాధించిన పతకాలను చూసిన ప్రిన్సిపల్ కంట్రోలర ఆమెను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. ఎస్తేరురాణి స్వస్థలం తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన వేమూరు. హైదరాబాద్‌లో జిమ్‌ట్రైనర్‌గా ఉంటూ బాడీబిల్డింగ్‌లో సాధన చేస్తున్నారు. ఇదే నెలలో చెన్నైలో జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 'మిస్ ఇండియా' టైటిల్‌తో బంగారు పతకం సాధించి, వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో 'యాక్ట్' వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు, స్నేహ గ్రూప్ ఆర్గనైజేషన్స్ చైర్మన డాక్టర కటికల శివభాగ్యరావు, వేల్పుల విశ్వనాథం, దాసరి వీరయ్య, 'యాక్ట్' హైదరాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్తేరురాణికి ప్రిన్సిపల్ కంట్రోలర్ అభినందన

అగస్తేశ్వరా... పాహిమాం...



మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం తెనాలి రూరల్ మండలం నందివెలుగులోని శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ఇలా ప్రత్యేకంగా అలంకరించారు.

– తెనాలి

8న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- డిసెంబర్ 5న ఎన్నికల ప్రకటన
- ఎన్నికల పై సిబ్బందికి అవగాహన
- తహసీల్దారు సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర: ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగేలా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు జి.సిద్ధార్థ, ఎంపీడీవో వి.విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, చివలూరు. అత్తోట ఆయా గ్రామాలల్లోని వాటర్ వినియోగదారుల అసోసియేషన్, గ్రామ సచివాలయం సిబ్బంది, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది, వీఆర్‌వోలకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలి, తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 8న నీటి వినియోగదారుల, సాగు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారని వివరించారు. డిసెంబర్ 5న సాగు నీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడుతుందని, డిసెంబర్ 8వ తేదీన ఒకే రోజు పూర్తి ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. ఎన్నికల సమంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, ఈవోపీఆర్డీ బార్గవ, సచివాలయం సిబ్బంది, వీఆర్‌వోలు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు సిద్ధార్థ

కొండవీటి సేవాసమితి కార్తిక వనసమారాధన

- పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి భారీగా హాజరు
- సేవాసమితి నూతన అధ్యక్షుడిగా పేరం సంజీవరెడ్డి

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీ పద్మావతీసమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం వైకుంఠపురంలో శుక్రవారం కొండవీటి సేవాసమితి 18 వ కార్తిక వనసమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెనాలి, పరిసర ప్రాంతాల నుంచి భారీగా జనం పాల్గొన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను వేడుకగా జరిపారు. మూడు బృందాలతో మహిళల కోలాట ప్రదర్శనలు, మూడు బృందాలుగా చిన్నారుల నృత్యాలు, ఇతర సాంస్కృతిక అంశాలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా ప్రదర్శకులను నిర్వాహకులు సత్కరించారు. వనసమారాధనలో భాగంగా లక్కీడిప్ తీశారు. విజేతలుగా వచ్చిన 50 మంది మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ఇదే వేదికపై కొండవీటి సేవాసమితి నూతన పాలక వర్గాన్ని ప్రకటించారు. కొండవీటి సేవా సమితి గౌరవ అధ్యక్షుడిగా కిక్కూరి శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడిగా మున్సిపల్ కౌన్సిలర్ పేరం సంజీవ రెడ్డి, కార్యదర్శిగా కామిరెడ్డి చిన్నారెడ్డి, కోశాధికారిగా ఉడుముల చిన్నబాలకోటిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఉయ్యూరు సంజీవరెడ్డి, దుండి శ్రీమన్నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కోశాధికారిగా మెట్టు శ్రీనివాసరెడ్డితో పాటు కార్యవర్గసభ్యులుగా సానికొమ్ము ప్రసాదరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, కర్నాటి శ్రీనివాసరెడ్డి, తమ్మా వెంకటరెడ్డి, పిట్టు కృష్ణారెడ్డి, చింతలచెరువు కోటిరెడ్డిని ఎన్నుకున్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని సత్కరించారు.



ప్రదర్శనలిచ్చిన చిన్నారులకు సత్కారం

7న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

తెనాలిఅర్బన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 7వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహించనున్నట్లు ఎంఈవో–2 వి.జయంతి బాబు తెలిపారు. కొత్తపేటలోని రామిసాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు.

అదే సమయంలో ఉన్నతాధికారులు నిర్వహించినవీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. దానిని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో వచ్చే నెల 7న సమావేశం నిర్వహించిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ప్రధానోపాధ్యాయులు

దళారులను నమ్మి మోసపోవద్దు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి, మోసపోవద్దని వ్యవసాయ అధికారి పి. శిరీష పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పించిందని, కొనుగోలుకు అవసరమైన గోతాలను డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తోందన్నారు. ముఠా కూలీ ఖర్చులకు క్వింటాకు రూ.17.17 చొప్పున చెల్లిస్తుందని, రవాణా సౌకర్యం కూడా కల్పిస్తోందని రైతులకు వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న వృత్తి విద్య కోర్సుల్లో భాగంగా, విద్యార్థులకు ఐసెక్ట్ సంస్థ సహకారంతో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యార్థులు బ్యాంకు సందర్శనకు శుక్రవారం వెళ్లారు. మండలంలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ కోర్సు శిక్షణ పొందుతున్నారు. దీనిలో భాగంగా గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకును సందర్శించారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన వివిధ రకాలైన సేవలు, డిపాజిట్లు, రుణాలు, ఏటీఎం ఉపయోగాలు గురించి విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ ఓ. నవజ్యోతి ఈ. గోపిఅరవింద్‌శాస్త్రి బ్యాంకింగ్ సేవలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ ఉపాధ్యాయులు యోహాను, సత్యకళ, సాగర్, వృత్తి విద్య అధ్యాపకులు అధ్యాపకులు ఇ. బాబుఅమర్నాథ్, టి. వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

